క్లుప్తంగా

104 వాహనం ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం రూరల్: ప్రతి పేదవాడికి ఖరీదైన వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకుని వచ్చారని వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డి అన్నారు. మండలంలోని కాచాపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా మంజూరైన 104 వాహనాన్ని పూజ చేసి ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ హేమలత, వైద్యాధికారి సురేష్, స్థానిక వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

రైతు భరోసాకు నమోదు చేసుకోండి



చిన్నతుంబళంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్

పెద్దకడబూరు : రైతు భరోసా రాని రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో పొలాలకు సంబంధించిన వివరాలు సమర్పించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. మండలంలోని చిన్నతుంభళం గ్రామ రైతు భరోసా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహామండలి సమావేశాన్ని పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎవరైనా కొత్తగా పొలం పాస్‌బుక్ చేయించుకుని వారి కుటుంబంలో ఎవరికీ రైతు భరోసా వర్తింకపోతే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రైతు భరోసా లబ్ధిదారులు చనిపోయి ఉంటే వాకి బదులుగా కుటుంబంలో ఒకరి పేరును చేర్చడానికి ఇప్పుడు అవకాశం ఉందన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు యల్లప్ప, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

11న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కౌతాళం: ఈనెల 11వ తేదీన మండలంలోని బాపురం, తోవి, చూడి గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరిస్తామని జైభీమ్ సభ్యులు తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎరిషావలి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి విడుదల చేశారు. దళిత సమాఖ్య నాయకులు తిమోతి, సర్పంచ్ పాల్‌దినకర్, మాజీ సర్పంచ్ అవతారం, ఉరుకుంద డానియల్ మాట్లాడుతూ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్ పాల్గొంటారని చెప్పారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

కౌతాళం: రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ చౌదరి బసవరాజు గురువారం తన ఇంట్లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినకరన్, ఉప సర్పంచ్ సక్రి తిక్కయ్య, వైస్ ఎంపీపీ రామలింగయ్యస్వామి, భీమా యూత్ నాయకులు భీమేష్, బసవ, రామాంజినేయులు, రాజ్‌అహ్మద్, సమ్మద్ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఖాదర్‌లింగ స్వామి దర్గా



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చారు. దీంతో దర్గా పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు జరుపుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. రంజాన్ మాసం కావడంతో చాలా మంది భక్తులు దర్గాలోని మసీదులోనే నమాజులు ఆచరించి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఆలూరు రూరల్: ఆరోగ్యమే మహా భాగ్యమని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి తరణి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒత్తిడి జయించేందుకు మానసిక ప్రశాంతత అవసరమన్నారు. బార్ అండ్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్ భాస్కర్ సీనియర్ న్యాయవాది వాయుజీవోత్తమ రావు, ప్రవీణ్, వలి, రంగప్ప వైద్యారోగ్య సిబ్బంది, గ్రామ ప్రజలు ఉన్నారు.

సొంతింటి కలకు డ్వాక్రా సాయం

- గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయడమే లక్ష్యం
- లబ్ధిదారులకు అదనపు ప్రయోజనం
- స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.35 వేల రుణం



మంత్రాలయం జగనన్న కాలనీలో జరుగుతన్న గృహ నిర్మాణాలు

మంత్రాలయం రూరల్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ప్రభుత్వం పేదల సొంతింటి కల నేరవేర్చడానికి పూనుకుంది.ఇందులో భాగ ంగా ఇప్పటికే ఆదోని, మంత్రాలయం నియోజక వ ర్గాల్లోని ఆయా గ్రామాల్లో స్థలాలను మంజూరు చే యడంతో కొందరు లబ్దిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేలా ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. సాధారణంగా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 ల క్షలు అందజేస్తుంది. ఈ సాయం సరిపోకపోతే మ రింత అందజేయాలని నిర్ణయించింది. ఇందులో భా గంగాస్వయం సహాయక సంఘాలమహిళలకు బ్యా ంకుల నుంచి రూ.35 వేల రుణం అందజేస్తుంది.

నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు..

ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు సర్కారు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అధికారులు, ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లను భాగ్యస్వాములుగా చేర్చి లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. గృహ నిర్మాణాల పరిశీలనకు ప్రత్యేకంగా అధికారులను సైతం కేటాయించింది. ప్రతి శనివారం హౌసింగ్ డే గా ప్రకటించి వారి పరిధిలోని ఒక జగనన్న కాలనీని సందర్శించి నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఏవైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించేలా, నిర్మాణాలు ప్రారంభించని వారికి అవగాహన కల్పించి పనులు మొదలుపెట్టేలా, బిల్లుల చెల్లింపులో నెలకొన్న సమస్యలు పరిష్కరించేల బాధ్యతలు అప్పగించింది. అలాగే జిల్లా స్థాయి అధికారులు ప్రతి శనివారం జిల్లాలోని ఏదో ఒక జగనన్న కాలనీని సందర్శించాలని ఆదేశాలు జారీ చేసింది.

లబ్ధిదారులకు'తోడుగా':

పక్కా ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి ప్రభుత్వం ముందుగా రూ 1.80 లక్షలు అందిస్తుంది. ఈ డబ్బులు సరిపోకపోవడంతో మరింత సాయాన్ని రుణంగా మంజూరు చేస్తోంది. అందులో భాగంగా డ్వాక్రా మహిళలకు తొలుత రూ 35 వేలు రుణంగా అందజేస్తుంది.

ఆదోని,మంత్రాలయం నియోజకవర్గాల్లో రుణాలు పొదిన వారి వివరాలు..

మండలం	నిర్మాణంలోనున్న గృహాలు	రుణాలుపొందిన గృహాలు	రుణంగా తీసుకున్న మొత్తం
ఆదోని	2,113	951	రూ. 3.32 కోట్లు
మంత్రాలయం	2,619	1610	రూ. 5.63 కోట్లు
కోసిగి	3,518	1674	రూ. 5.85 కోట్లు
పెద్దకడబూరు	1,187	719	రూ. 2.51 కోట్లు
కౌతాళం	2,346	1187	రూ. 4.15 కోట్లు

రూ.35 వేల రుణం పొందాను



ఎమ్మిగనూరు రహదారిలోని జగనన్న కాలనీల్లో స్థలంతో పాటు ఇళ్లు మంజూరైంది. రాష్ట్రం ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షలు సరిపోక డ్వాక్రా సంఘాల ద్వారా రూ. 35 వేలు రుణంగా పొందాను. అదే డబ్బు బయట తీసుకుంటే అధిక వడ్డీ చెల్లించాలి. డ్వాక్రా సంఘాల ద్వారా తీసుకుంటే వడ్డీ తక్కువ పడుతుంది.

– అనురాధ, లబ్ధిదారు, మంత్రాలయం

వడ్డీ భారం తప్పింది



జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణం చేపడుతున్నా. నాకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.1.80లక్షలు సరిపోక డ్వాక్రా సభ్యురాలిని కావడంతో రూ. 35 వేలు రుణంగా పొంది ఇంటి నిర్మాణం చేపట్టాను. అదే మొత్తం బయట అప్పుగా తీసుకుంటే అధిక వడ్డీ చెల్లించాలి. పొదుపు ద్వారా రుణంగా ఇవ్వడంతో వడ్డీ భారం తప్పింది.

– రాఘమ్మ, లబ్ధిదారు, మంత్రాలయం

డ్వాక్రాలో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది



ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు ప్రభుత్వం అందజేసే మొత్తం సరిపోకపోతే నేరుగా వెలుగు కార్యాలయంలో డ్వాక్రా సంఘాల ద్వారా రూ. 35 వేల రుణం పొందవచ్చు. ఇందుకు సంబంధించిన వివరాలన్నీ డ్వాక్రా సంఘాల వద్దే ఉంటాయి. అక్కడ దరఖాస్తు చేసుకుంటే డబ్బులు జమ అవుతాయి.

– లాలుకృష్ణయ్య, హౌసింగ్ డీఈ, మంత్రాలయం

ఇంటింటికీ వెళ్లండి



పోస్టర్ విడుదల చేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం రూరల్: అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి సూచించారు. గురువారం ఎమ్మిగనూరు పట్టణంలోని భీమ నిలయంలో జగనన్నే మా భవిష్యత్, నువ్వే మా నమ్మకం జగన్ అనే కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి పార్టీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కో కన్వీనర్లు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకొని వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

పెద్దకడబూరు : ఎమ్మిగనూరు నుంచి కోసిగి ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, రైతుసంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యన్న కోరారు. సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ అధ్యక్షతన మండల పరిధిలోని కంబలదిన్నె గ్రామం నుంచి హెచ్.మురవణి నాలుగవ మైలురాయి వరకు గురువారం పాదయాత్ర చేపట్టారు. వారు మాట్లాడుతూ రహదారుల మరమ్మతుల విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రజలు కష్టాలు పడుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వం నుంచి రూ. 20కోట్లు మంజూరై నాలుగు నెలలు కావస్తున్నా పనులు చేపట్టకపోవడం సరికాదన్నారు. లక్ష్మణ్‌నాయక్, చంద్ర, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



ఆరేకల్‌లో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి వద్దకే వైద్యం అందించేందుకు ప్రత్యేకంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ (కుటుంబ డాక్టర్) విధానాన్ని ప్రవేశపెట్టడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఆరేకల్ గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్దతుంబళం, పెద్దహరివాణం గ్రామాల్లో రెండు ప్రజా వైద్యశాలలు ఉండగా, వీటి పరిధిలో 44 గ్రామాలు ఉన్నాయన్నారు. ఈ వైద్యశాలల పరిధిలో ఉన్న గ్రామాల్లో నడవలేని పరిస్థితిలో ఉన్న వారికి ఇంటి వద్దకే వైద్యసేవలు అందజేస్తారని చెప్పారు. అలాగే ఆరోగ్యశ్రీ కింద అధునాతన వైద్యచికిత్సలు అందిస్తారని, 104 వాహనం ప్రతిరోజూ నిర్దేశించిన గ్రామానికి వెళ్లి ఉదయం ఓపీ సేవలు అందిస్తారని, 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, ఎంపీడీఓ గీతావాణి, పెద్దతుంబళం డాక్టర్ దివ్య, పెద్దహరివాణం డాక్టర్ ఇమ్రాన్, ఆరేకల్ సర్పంచ్ లోహితప్రియ పాల్గొన్నారు.

జగనన్నతోనే మన భవిష్యత్



జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, కార్యకర్తలు

ఆదోని టౌన్ : జగనన్న సీఎం కావడంతో రాష్ట్రంలో మునుపెన్నడూ లేనంత సంక్షేమం, అభివృద్ధి జరుగుతోందని, పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిపారని, అలాంటి సీఎంను మళ్లీ సీఎంగా చేసుకుంటనే మన భవిష్యత్ తరాలు బాగుంటాయని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. మనందరి బాగు కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవులు రాలేదని నిరుత్సాహం చెందొద్దని, వచ్చే ఎన్నికల్లో సమష్టిగా వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చుకుంటే అందరి జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులు చేపడుతూ పాలన కొనసాగిస్తోందని చెప్పారు. ఎవరూ నిరుత్సాహం పడొద్దని, అందరికీ అండగా తానున్నానని భరోసా ఇచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, దేవా, వీరారెడ్డి, రామాంజనేయులు, ఆంధ్రా లక్ష్మన్న, సన్నీ, నరసింహులు, నల్లారెడ్డి, సందీప్‌రెడ్డి, తిమ్మప్ప, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

11న పూలే జయంతి

కర్నూలు(సెంట్రల్): మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఏప్రిల్ 11వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం డీఆర్వో కార్యాలయంలో పూలే జయంతి వేడుకల నిర్వహణపై అధికారులు, బీసీ సంఘాల నాయకులతో చర్చించారు. పేద, బడుగు బలహీన వర్గాల నేత పూలే వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. సంక్షేమ భవన్ ఎదుట ఉన్న ఆయన విగ్రహం ఎదుట సభను ఏర్పాటు చేసి అక్కడే నివాళి అర్పించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సలహాలు, సూచలను బీసీ సంఘాల నేతల నుంచి స్వీకరించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి ఏ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

8న వాహనాల వేలం



డీఎస్పీ వినోద్‌కుమార్

ఆదోని రూరల్: ఆదోని సబ్ డివిజన్‌లోని ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేయబడిన వాహనాలకు ఈనెల 8, 9వ తేదీన ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 181 వాహనాలకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఫోర్ వీలర్స్–2, త్రీవీలర్స్–10, టూ వీలర్స్–169 ఉన్నాయన్నారు. వేలం పాటల్లో పాల్గొనే వారు రూ.5 వేలు ప్రవేశ రుసుము చెల్లించి ఆధార్ కార్డుతో తీసుకురావాలని సూచించారు.

స్టేషన్ల వారీగా వాహనాల వివరాలు..

ఆదోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 16, ఆదోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 8, ఆదోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2, ఆదోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో 2, గోనెగండ్ల స్టేషన్ పరిధిలో 13, ఇస్వీ పోలీస్‌స్టేషన్ పరిధిలో 9, కోసిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో 26, కౌతాళం పోలీస్‌స్టేషన్ పరిధిలో 66, మాధవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 9, మంత్రాలయం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2, నందవరం పోలీస్‌స్టేషన పరిధిలో 8, పెద్దకడబూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 5, పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ పరిధిలో 5, ఎమ్మిగనూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 9, ఎమ్మిగనూరు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1 ఉన్నట్లు వివరించారు.

రమణీయం.. రామలింగేశ్వర స్వామి రథోత్సవం



కల్లుదేవకుంటలో ప్రత్యేక అలంకరణలో కర్రివీరభద్రస్వామి



కందుకూరులో భక్తుల మధ్య ఊరేగుతున్న రామలింగేశ్వర స్వామి వారి మహా రథోత్సవం

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామ ప్రజల ఆరాధ్య దైవం, తుంగభద్ర నది ఒడ్డున వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి మహా రథోత్సవం రమణీయంగా సాగింది. గురువారం అంపయ్య పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ కమిటీ అధ్యక్షుడు శరణప్పగౌడ ఆధ్వర్యంలో వేకువజామునే తుంభభద్ర నదీ జలాలతో స్వామి వారికి అభిషేకాలు చేపట్టారు. అలాగే.. రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచన అలంకరణ, మహా మంగళ హారతులు ఇచ్చారు. సాయంకాలం ఆలయం నుంచి పల్లకీలో స్వామి వారి ఉత్సవమూర్తిని కలశాల, మేళతాలాలు, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా రథం వరకు తీసుకొచ్చి అక్కడ ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం రథంపై అధిష్టింపజేసి భక్తుల జయజయ ధ్వానాల మధ్య కొంత వరకు ఊరేగించి యథా స్థానానికి చేర్చారు. భక్తుల రథంపై అరటి పళ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు.ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



ఊరేగింపుగా ఆలయం చేరుకున్న వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు, నాయకులు

ఆధ్యాత్మిక అలవరచుకోవాలి..

నేటి ఆధునిక కాలంలో మానవాళి మనుగడకు ఆధ్యాత్మికత అలవరుచుకోవాలని, అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని బిచ్చాలి సావిరదేవర సంస్థాన మఠం పీఠాధిపతులు వీరతపస్వి వీరభద్ర శివచార్యులు, హాల్వి శరణగిరి మఠం పీఠాదిపతులు అభినవ మహాంతేష్ స్వామి సూచించారు. గురువారం కందుకూరులో శ్రీరామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం వారు భక్తులను ఉద్దేశించి ఉపన్యసించారు. వారితో పాటు పీఠాధిపతులు అభినవ రాచోటి వీర శివచార్యులు, నీలగల్లు మహాస్వామి, షడషణు మహాస్వామి, రాజశేఖర స్వామి హాజరయ్యారు. ఆలయ కమిటీ పెద్దలు వీఎస్ఎన్ మూర్తి, బెట్టన గౌడ, ఎర్రిస్వామి, చంద్రశేఖరయ్య పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

మంత్రాలయం రూరల్: మండలంలోని కల్లుదేవకుంట, వి.తిమ్మాపురం గ్రామాల్లో వెలసిన కర్రివీరభద్రస్వామి, రామప్ప తాత రథోత్సవాలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తులును రథాలపై అధిష్టింపజేసి ఊరేగించారు. కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ నేతలు వై.ప్రదీప్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి రథోత్సవంలో పాల్గొన్నారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వడగండ్ల వర్షం.. రైతులకు నష్టం



పడిపోయిన విద్యుత్ స్తంభాలు

కౌతాళం: వడగండ్ల వర్షంతో రైతులకు నష్టం వాటిల్లింది. గురువారం సాయంత్రం మండలంలో గాలితో కూడిన వడగండ్ల వాన కురవడంతో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ముఖ్యంగా నదిచాగి గ్రామంలో అధికంగా నష్టం వాటిల్లింది. తుంగభద్ర నదితీరంలో ఉన్న 24 గంటల పాటు కరెంటు ఉండే లిఫ్ట్ ఇరిగేషన్ విద్యుత్ లైన్‌తో పాటు వ్యవసాయ విద్యుత్ మోటార్లకు సరఫరా అయ్యే లైన్‌లో 7స్తంభాలు విరిగిపోగా 15స్తంభాలు నెలకొరిగాయి. అలాగే మరో వారంలోపు కోయనున్న వరి పంట గాలివానకు నేలకొరడంతో గింజలు రాలిపోయాయని రైతులు వాపోయారు.



నేలకొరిగిన వరి పంట పైరు

ఉల్లాసంగా శోభాయాత్ర

హొళగుంద: మండలంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పుర వీధుల్లో స్వామి చిత్ర పటాన్ని ఊరేగింపు నిర్వహించారు. అలాగే గ్రామానికి 5 కి.మీ దూరంలో వెలసిన అగ్రహార ఆంజనేయ స్వామిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో అభిషేకాలు, పవమాన హోమం, మహామంగళ హారతి, అలంకారం, ఆకుల అర్చన, రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు.

బలహీన వర్గాల కాలనీల్లో ఆలయ నిర్మాణాలు



గంగపుత్ర ఆలయ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆదిశేషనాయుడు

కౌతాళం: టీటీడీ ఆధ్వర్యంలో గ్రామాల్లోని బడుగు బలహీన వర్గాల కాలనీల్లో కొత్తగా ఆలయ నిర్మాణాలు చేపట్టడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ ఆదిశేషనాయుడు తెలిపారు. గురువారం స్థానిక ఎస్సీ కాలనీలోనున్న బసవలింగేశ్వర స్వామి ఆలయం, బీసీ కాలనీలోని గంగపుత్ర, బీర లింగేశ్వర, సుంకులమ్మదేవి, త్రయంబకేశ్వర స్వామి ఆలయాలను పరిశీలించారు. టీటీడీ కల్పించిన అవకాశాన్ని గ్రామీణ ప్రాంత దేవాలయ నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎక్కడైన దేవాలయ భూములు అన్యక్రాంతమైతే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ఉప సర్పంచ్ తిక్కయ్య, మాజీ సర్పంచ్ అవతారం, ఉరకుంద ట్రస్టుబోర్డు డైరెక్టర్ వెంకోబ పాల్గొన్నారు.

వేడుకగా చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం



జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరి దేవి జ్యోతి మహోత్సవ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం తుంగభద్ర నది జలాలను తీసుకురాగా.. గ్రామంలోని రామలింగేశ్వర స్వామి దేవాలయం వరకు మహిళలు కలశాలతో స్వాగతం పలికారు. అనంతరం దేవాలయం నుంచి జ్యోతిని మంగళవాయిద్యాలతో భజనలతో అమ్మవారి దేవాలయానికి చేర్చారు. అనంతరం నదీ జలాలతో అమ్మవారికి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. జ్యోతుల ఉత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అలాగే.. తొగట వీర క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయ ప్రసాద్ ప్రత్యేక పూజలు చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు గుంపు వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు ఇట్టే కిష్టప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



ఆంజనేయస్వామి చిత్రపటానికి ఊరేగిస్తున్న భక్తులు

కౌతాళం: మండలంలో నాయీ బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున స్వామి వారి విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, మహామంగళ హారతి తదితర విశేష పూజలు చేపట్టారు. అనంతరం స్వామి వారి చిత్రపటాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు.ముత్తయిదువులు కలశాలతో ముందు నడవగా.. భాజాభజంత్రీల ఊరేగింపు సాగింది.